ఈటల నామినేషన్‌కు తరలిన బీజేపీ శ్రేణులు


ఈటల నామినేషన్ కార్యక్రమానికి వెళ్తున్న కూకట్‌పల్లి బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమానికి కూకట్‌పల్లి నుంచి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లారు. కూకట్‌పల్లి బీజేపీ అభ్యర్థికి భారీ మెజార్టీ లభించడం ఖాయమని రాజేశ్వరరావు తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బండి రమేష్

కూకట్‌పల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు పార్టీ శ్రేణులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ కోరారు. కేపీహెచ్‌బీ కాలనీలోని సితార హోటల్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్‌స్థాయిలో పని చేయాల్సిన కార్యకర్తల కష్టంపై అభ్యర్థి మెజార్టీ ఆధారపడి ఉంటుందన్నారు. డివిజన్లవారీగా సమావేశాలు నిర్వహించి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయనున్నట్టు వివరించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్నీ డివిజన్లలో చేపట్టే సమావేశాలకు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి పాల్గొంటారని ఆయన వివరించారు. సత్యం శ్రీరంగం, నాగిరెడ్డి, తూము వేణు, శేరి సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.


పట్టాభిషేకంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా శ్రీరాముడి పట్టాభిషేకం

కూకట్‌పల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా శ్రీరాముడి పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. వేడుకను తిలకించేందుకు వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ రోజాదేవి, ఆలయ చైర్మన్ నాయినేని తులసీరావు దంపతులు పాల్గొన్నారు. స్వామివారి పట్టాభిషేకానికి సంబంధించిన వస్త్రాలు, ఆభరణాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా సమర్పించారు.


ఎన్‌టీఆర్ నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించండి: ఎమ్మెల్యే

గాజులరామారం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఇరవై ఏళ్లుగా సామాజిక కార్యక్రమాలతో నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గాజులరామారం డివిజన్‌లో శ్రీరామ్‌నగర్, బేకరిగడ్డ, ఎన్‌టీఆర్ నగర్‌ల్లో కార్పొరేటర్, డివిజన్ అధ్యక్షుడు, నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు స్థానికులు కాదని, ఇక్కడ సమస్యలు వారికి ఎట్లా తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శేషగిరి, సింగిల్‌విండో డైరెక్టర్ శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు విజయ్‌రామ్‌రెడ్డి, సీనియర్ నాయకులు చెట్ల వెంకటేష్, ఇబ్రహీమ్, కస్తూరి బాలరాజు, కమలాకర్, మూసాఖాన్, మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయఢంకా మోగిస్తుంది


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

మియాపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జయ ఢంకా మోగిస్తుందని శేరిలింగంపల్లి నియోకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. గురువారం హఫీజ్‌పేట డివిజన్ ఓల్డ్‌హఫీజ్‌పేట, రాయదుర్గంలో కార్పొరేటర్ పూజితతో కలిసి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తోందన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేసే రంజిత్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. మాజీ కౌన్సిలర్ నర్సింగ్‌రావు, నరేందర్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, రాములుగౌడ్ పాల్గొన్నారు.


అంబీర్‌చెరువు అలుగును పరిశీలిస్తున్న కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్

అంబీర్‌చెరువు అలుగు పరిశీలన

హైదర్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నట్టు హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని అంబీర్‌చెరువు అలుగును నిజాంపేట డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, 3వ వార్డు కార్పొరేటర్ వెంకట్రామయ్య, 20వ వార్డు కార్పొరేటర్ బాలాజీనాయక్‌తో కలిసి నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. చుట్టుపక్కల కాలనీల నుంచి వచ్చే మురుగునీరు అంబీర్‌చెరువులో కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెరువు అలుగు వద్ద చెత్తచెదారం పేరుకుపోవడం వలన నీటి ప్రవాహం సాఫీగా వెళ్లక మురుగునీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే వ్యర్థాలను తొలగించి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటామన్నారు. నవీన్‌నాయుడు, బ్రహ్మం, సీతారామరాజు, వర్మ పాల్గొన్నారు.

21న ఏవీ సావిత్రి లలితసంగీత పోటీల రజతోత్సవం

చిక్కడపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాంస్కృతిక సంస్థ నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో అలనాటి ప్రముఖ గాయని, ఆకాశవాణి కళాకారిణి ఏవీ సావిత్రి లలిత సంగీత పోటీల రజతోత్సవ కార్యక్రమాన్ని ఈనెల 21న త్యాగరాయ గానసభలో నిర్వహించనున్నట్టు సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సమన్వయకర్త నిష్టల సుధామాల తెలిపారు. ఈ సందర్భంగా నృత్యనాటిక ప్రదర్శన, లలితసంగీత విభావరి జరుగుతుందన్నారు. లలితసంగీత పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమ వివరాల పోస్టర్‌ను గురువారం చిక్కడపల్లిలో సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. నృత్యకళాకారులు మధుమతి, స్నేహరామ్‌చందర్, లక్ష్మీమానస, హరినాథ్‌బాబు పాల్గొన్నారు.

రూ.100 కోట్ల పార్కు స్థలాలు కబ్జా

స్థానిక నాయకుల సహకారంతో రిజిస్ట్రేషన్లు


పార్కు స్థలంలో వెలసిన ప్రహరీ

దుండిగల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్‌లో రూ.100 కోట్ల విలువ చేసే పార్కు, ఖాళీ స్థలాలు కబ్జాకు గురయ్యాయి. ఈ స్థలాలను ప్లాట్లుగా చేసి నకిలీ వ్యక్తుల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకొని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు విక్రయాలు చేస్తున్నట్టు బీజేపీ నిజాంపేట కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణకు గురువారం ఫిర్యాదు చేయడంతో కబ్జా బాగోతం వెలుగులోకి వచ్చింది. మల్లంపేట్ కేవీఆర్ లేఔట్‌లో ఉన్న ఖాళీ స్థలాలతో పాటు పార్కు స్థలాలను సైతం కబ్జా చేసి తప్పుడు పత్రాలు సృష్టించి, నకిలీ వ్యక్తితో సంతకాలు ఫోర్జరీ చేయించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారమంతా స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో జరిగినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. పార్కు, ఖాళీ స్థలాలను కబ్జా చేసిన వారిపై కేసులు నమోదు చేసి, ఆ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని ఆకుల సతీష్‌తో పాటు కాలనీవాసులు కోరుతున్నారు.

వివరాల్లోకి వెళితే.. మల్లంపేట్ సర్వేనంబర్ 11, 12, 13, 15, 22 నుంచి 38 వరకు, 45, 46, 61, 262, 263 సర్వే నంబర్లలో గల 54 ఎకరాల్లో 2004-05 సంవత్సరంలో కేవీఆర్ లేఔట్ పేరుతో ఏవీ రామరాజు వెంచర్ చేశారు. ఈ వెంచర్‌లో ప్రజా అవసరాల కోసం 14 పార్కులు చూపిస్తూ ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్నారు. కానీ 2014 తరువాత ఔటర్ రింగ్ రోడ్డు, బఫర్ జోన్ పాటు కేవీఆర్‌కాలనీ పార్కులో ఖాళీగా ఉన్న స్థలాలను బీఆర్‌ఎస్ నాయకులు తమ అనుచరుల సహకారంతో కబ్జా చేశారు. ఆ స్థలాలకు ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేసుకొని, ఏవీ రామరాజు అమ్మినట్లు రిజిస్ట్రేషన్ చేసే విధంగా హైకోర్టు నుంచి (డబ్ల్యూపీ 10603/ 2022) ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఏవీ రామరాజు ఆర్థిక ఇబ్బందుల కారణంగా బయటి వ్యక్తులతో సంబంధం లేకుండా ఆశ్రమాల్లో కాలం గడుపుతున్నాడు. ఈ విషయాన్ని అదనుగా భావించిన స్థానిక నాయకులు ఏవీ రామరాజు సంతకం ఫోర్జరీ చేసి నకిలీ వ్యక్తితో రిజిస్ట్రేషన్ చేయించుకొని విక్రయాలు చేస్తున్నారు. కానీ రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఫొటో దిగిన వ్యక్తి ఏవీ రామరాజు కాదని తెలుస్తోంది. కాబట్టి ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపి ప్రజలకు ఉపయోగపడాల్సిన స్థలాలను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

విచారణ చేసి ఆ స్థలాలను కాపాడుతా..

మల్లంపేట్ గ్రామంలో కేవీఆర్ లేఔట్‌లో పార్కు, ఖాళీ స్థలాలను ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి, నకిలీ వ్యక్తులతో రిజిస్ట్రేషన్లు చేయించుకొని విక్రయాలకు పాల్పడుతున్నట్లు మాకు ఫిర్యాదు అందింది. కాబట్టి కేవీఆర్ లేఔట్‌లో పార్కు స్థలాల విక్రయాలపై పూర్తిస్థాయి విచారణ చేసి, తగిన చర్యలు తీసుకొంటాం. ఆ స్థలాలను కాపాడి ప్రజల అవసరాలకు ఉపయోగపడే విధంగా చూస్తాం.

- కల్వకుంట్ల సత్యనారాయణ, దుండిగల్ మున్సిపల్ కమిషనర్


ఏవీ రామరాజు పేరుతో నకిలీ వ్యక్తి



రిజిస్ట్రేషన్ చేసిన సమయంలో ఏవీ రామరాజు

రణరంగంగా హెచ్‌సీయూ

- ఏబీవీపీ, ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థుల మధ్య ఘర్షణ
- హాస్టల్‌లో అర్ధరాత్రి ఘటన.. 15 మందికి గాయాలు



చికిత్స పొందుతున్న విద్యార్థులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ హాస్టల్‌లో విద్యార్థి సంఘాల మధ్య ఘర్షణ జరగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వర్సిటీ జే బ్లాక్‌లో బుధవారం అర్ధరాత్రి ఏబీవీపీ, ఎస్‌ఎఫ్‌ఐ సంఘాలకు చెందిన విద్యార్థులు పరస్పరం బాహాబాహీకి దిగారు. ఇరువర్గాల వారు ఒకరికి వ్యతిరేకంగా మరొకరు నినాదాలు చేసుకున్నారు. ఇది కాస్తా ముదరడంతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో 15 మంది విద్యార్థులు గాయపడ్డారు. ఏబీవీపీ నాయకులు గత ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక తమ భావజాలాన్ని వ్యతిరేకించిన వారిపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆరోపించారు. విద్యార్థినులపై కూడా చేయిచేసుకున్నారని, అసభ్య పదజాలంతో దూషించారని తెలిపారు. గొడవను ఆపేందుకు యత్నించిన సెక్యూరిటీ సిబ్బందిపై కూడా చేయిచేసుకున్నారని, దాడులు చేస్తున్న సమయంలో వీడియో తీసిన వారిని బెదిరించి, వీడియోలు డిలీట్ చేయించారని ఆరోపించారు. వర్సిటీలో విద్యార్థులపై తరచు దాడులకు పాల్పడుతున్న వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని వీసీ కార్యాలయం ముందు గురువారం నిరసన తెలిపారు. ఇదిలా ఉండగా హాస్టల్‌లో గొడవ జరగడానికి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులే కారణమని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు.

బాలుడి ఆత్మహత్యాయత్నం

జీడిమెట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని బాలుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ గార్డెన్‌బస్తీకి చెందిన విశ్వేశ్వరరావు కుమారుడు కౌశిక్‌సాయి(12) ఈనెల 17వ తేదీన రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం గమనించిన కుటుంబసభ్యులు బాలుడిని ఆసుపత్రిలో చేర్చారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు పేర్కొంటున్నారు. జీడిమెట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విడాకుల కోసం యువకుడి హల్‌చల్

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): భార్య నుంచి విడాకులు కావాలని ఓ యువకుడు క్వారీ గుంతలోకి దిగి హల్‌చల్ చేశాడు. ఈ సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ విజయ్‌వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లి గ్రామానికి చెందిన నగేష్(34) భార్య నందినితో కలిసి ఉంటూ మెకానిక్‌గా పని చేస్తున్నారు. వీరికి కుమారుడు తన్వి, కుమార్తె నక్షత్ర ఉన్నారు. గురువారం మద్యం మత్తులో కొంపల్లి మున్సిపాలిటీలోని జయభేరి పార్కులోని క్వారీ గుంతలో దూకి ఆత్మహత్య చేసుకుంటానంటూ నగేష్ హల్ చల్ చేశాడు. తన భార్య నిత్యం వేధిస్తోందని, విడాకులు ఇప్పించాలని క్వారీలో దూకబోయాడు. నగేష్ తమ్ముడు రాహుల్ 100కు డయల్ చేయగా సంఘటనా స్థలానికి చేరుకుని నగేష్‌కు నచ్చజెప్పి తాడు సహాయంతో ఏఎస్‌ఐ మల్లారెడ్డి, శ్రీనివాస్‌లు రెండు గంటలు శ్రమించి నగేష్‌ను బయటకు తీశారు.

స్టోన్ బ్యాచ్‌పై మరో రెండు కేసులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ స్టోన్ బ్యాచ్‌పై మరో రెండు కేసులు నమోదయ్యాయి. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు-2లోని గాప్ క్లాప్ స్టోర్‌లో గత నెల 20న వినియోగదారులు ఉండగా పెద్ద శబ్దాలు చేస్తూ అద్దాలు పగిలిపోయాయి. ఏమి జరిగిందో తెలియక నిర్వాహకులు ఆందోళనకు గురయ్యారు. అద్దాలు పగిలిన చోట రాయి కనిపించింది. ఇదే విషయాన్ని సదరు షోరూం సిబ్బంది యాజమాన్యానికి తెలియజేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-2లో జోగ్ రెస్టారెంట్ అద్దాలు ఈనెల 2న పెద్ద శబ్దాలతో పగిలిపోయాయి. తాజాగా ఇలాంటి ఘటనలపై కేసులు నమోదు కావడంతో రెండు వ్యాపార సముదాయాల మేనేజర్లు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని బీటెక్ విద్యార్థి మృతి


మృతి చెందిన లక్ష్మణ్

జీడిమెట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబసభ్యులకు టిఫిన్ తీసుకురావడానికి బైక్‌పై వెళ్తున్న ఓ బీటెక్ స్టూడెంట్‌ని ఓ ప్రైవేట్ బస్సు ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాజులరామాం మహదేవ్‌పురం వద్ద గురువారం ఉదయం చోటుచేసుకుంది. సంగారెడ్డి జిల్లా, సిరిగాపూర్ గ్రామానికి చెందిన ఏషబోయిన రాములు గాజులరామారం ప్రాంతంలోని మల్లారెడ్డినగర్, షిర్డీహిల్స్ వద్ద గల ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య సుజాత, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు లక్ష్మణ్(19) ఉన్నారు. లక్ష్మణ్ బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం ఉదయం 6.30 గంటలకు కుటుంబసభ్యులకు టిఫిన్ తీసుకురావడానికి స్కూటీపై వెళ్లాడు. మల్లారెడ్డినగర్ వైశాలి టింబర్ డిపో వద్ద ప్రైవేట్ బస్సు వేగంగా వచ్చి లక్ష్మన్‌ను ఢీకొట్టింది. దీంతో లక్ష్మణ్ తలపై నుంచి బస్సు చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. లక్ష్మణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కారు ఢీకొని బాలుడి మృతి



జీడిమెట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సైకిల్‌పై వెళ్తున్న ఐదేళ్ల బాలుడిని వెనుక నుంచి కారు వేగంగా ఢీకొట్టడంతో కడుపులో తీవ్రగాయాలై మృతి చెందాడు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ విమానపురికాలనీకి చెందిన మర్గూబ్‌అలీ కార్పెంటర్ షాపు నిర్వహిస్తున్నాడు. అతడి కుమారుడు మహ్మద్(5) బుధవారం ఉదయం 11 గంటలకు విమానపురికాలనీ నుంచి తండ్రి నడుపుతున్న షాపు వద్దకు సైకిల్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో సుచిత్రా నుంచి వేగంగా వచ్చిన బొలెరో వాహనం బాలుడిని ఢీకొట్టింది. దీంతో బాలుడి కడుపుపైన వాహనం చక్రాలు ఎక్కడంతో తీవ్రగాయాలై మృతి చెందాడు. ఈ మేరకు డ్రైవర్ గడ్డం శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేశారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

క్వారీలో పడి ఇద్దరు యువకులు మృతి

- ప్రాణాపాయస్థితి నుంచి బయటపడ్డ మరో యువకుడు
- ఈత రాకపోవడంతోనే నీటిలో మునక



ప్రాణాలు కోల్పోయిన యువకులు

జీడిమెట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఈత సరదా ఇద్దరి యువకుల ప్రాణాలు బలి తీసుకుంది. మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. ఒకే బస్తీకి చెందిన ఇద్దరు యువకులు క్వారీ గుంతలో మునిగి ప్రాణాలు కోల్పోవడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాజులరామారం క్వారీల వద్ద జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లమ్మబండ ప్రాంతంలోని ఎన్‌టీఆర్‌నగర్‌కు చెందిన బైక్ మెకానిక్ షేక్ కుమారుడు షేక్ అయాన్(15), సయ్యద్, తస్లీమాల కుమారుడు నవాజ్(16), హైదర్(16)లు స్నేహితులు. వీరు ముగ్గురు ఎల్లమ్మబండ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నారు. గురువారం మధ్యాహ్నం 1 గంటల ప్రాంతంలో ఈత కొట్టాలని గాజులరామారం దేవేందర్, మిథిలానగర్ సమీపంలోని క్వారీవద్దకు చేరుకున్నారు. అయాన్, నవాజ్‌లు లోతైన ప్రాంతలో దూకడంతో మునిగిపోయారు. హైదర్ తక్కువ లోతున్న ప్రాంతలో దూకాడు. వీరికి ఈత రాకపోవడతో అయాన్, నవాజ్‌లు ప్రాణాలు కోల్పోయారు. హైదర్ అతి కష్టం మీద బయటకు వచ్చి స్థానికులకు సమాచారం అందించారు. వారు పోలీసులు రంగంలోకి దిగి రెండు శవాలను నీటి నుంచి తీసి గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

అల్లాపూర్, 18 ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): మూసాపేట డివిజన్ జనతా నగర్‌కు చెందిన సంద్రాల హరిశంకర్(34) ర్యాపిడో డ్రైవర్‌గా పని చేసేవాడు. కుటుంబ సమస్యల కారణంగా బుధవారం విషం తాగి ఆత్మహత్యకు యత్నించగా, కుటుంబసభ్యులు అతడిని గాంధీ అస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో హరిశంకర్ గురువారం ఉదయం మృతిచెందినట్టు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసుకున్న కూకట్‌పల్లి పోలీసులు విచారణ జరుపుతున్నట్టు సీఐ కృష్ణమోహన్ తెలిపారు.

ఎఫ్‌ఎఫ్‌సీ తనిఖీలపై ఎన్నికల సంఘం ఫోకస్!

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో జేఎన్‌టీయూ తలపెట్టిన ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ(ఎఫ్‌ఎఫ్‌సీ) తనిఖీలపై ఎన్నికల సంఘం దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఎఫ్‌ఎఫ్‌సీ తనిఖీలు జరిగాక ఆయా కాలేజీల్లో సీట్ల పెంపునకు జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు అనుమతిలిచ్చే అవకాశం ఉందని, ఈ ప్రక్రియలో రూ.కోట్లు చేతులు మారబోతున్నాయని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్(ఎంఎస్‌ఎఫ్) ఆరోపించింది. కొన్ని ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలకు రాజకీయ పార్టీలతో అనుబంధం ఉన్నందున ఎఫ్‌ఎఫ్‌సీ తనిఖీల ప్రక్రియ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఎంఎస్‌ఎఫ్ అధ్యక్షుడు డి.శ్రీకాంత్.. ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరిగేలా చూడాలని, ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో జేఎన్‌టీయూ తనిఖీల ప్రక్రియను వాయిదా వేయాలని సీఈఓను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు శ్రీకాంత్ తెలిపారు. ఫార్మసీ కాలేజీల్లో తనిఖీలకు బ్రేక్.. ఇంజనీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ కాలేజీల్లో 19వ తేదీనుంచి ఎఫ్‌ఎఫ్‌సీ తనిఖీలు నిర్వహిస్తామని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ఈనెల 15న జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొన్నారు. నేటినుంచి ప్రారంభం కానున్న ఎఫ్‌ఎఫ్‌సీ తనిఖీల నుంచి ఫార్మసీ కాలేజీలకు మినహాయింపు ఇచ్చినట్టు తెలిసింది. గత నెలలో ఒకరోజు మాత్రం ఇంజనీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ కాలేజీల్లో ఎఫ్‌ఎఫ్‌సీ తనిఖీలు నిర్వహించిన జేఎన్‌టీయూ అధికారులు.. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో అర్ధాంతరంగా వాయిదా వేశారు. తాజాగా చేపడుతున్న తనిఖీల నుంచి ఫార్మసీ కాలేజీలకు మాత్రమే మినహాయింపు ఇవ్వడం పట్ల ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ కాలేజీల యాజమాన్యాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. కొన్ని ఫార్మసీ కాలేజీల యాజమాన్యాలు ఫ్యాకల్టీ లోటును భర్తీ చేసుకునేందుకు గడువు కావాలని విద్యాశాఖ ముఖ్య అధికారులను కోరాయని, ఈ మేరకు గురువారం జేఎన్‌టీయూ అధికారులకు విద్యాశాఖ నుంచి ఆదేశాలు అందినట్టు సమాచారం. మరోవైపు ఎఫ్‌ఎఫ్‌సీ తనిఖీల ప్రక్రియపై ఎన్నికల సంఘం దృష్టి సారించినందున తనిఖీలు సజావుగా జరుగుతాయా లేదా.. మళ్లీ అర్ధాంతరంగా ఆగిపోతాయా అని.. ఎఫ్‌ఎఫ్‌సీల్లో సభ్యులుగా ఉన్న ప్రొఫెసర్లు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా, ఎఫ్‌ఎఫ్‌సీ తనిఖీలను తాము కొత్తగా ప్రారంభించడం లేదని, గత నెలలో ప్రారంభమై ఆగిపోయిన తనిఖీల ప్రక్రియను శుక్రవారం నుంచి కొనసాగిస్తున్నామని చెప్పారు. ఎఫ్‌ఎఫ్‌సీ తనిఖీలు ఆపించాలని ఎన్నికల సంఘానికి విద్యార్థి సంఘాలు చేయడం గురించి తమ దృష్టికి రాలేదన్నారు.

దూర విద్యను పటిష్ఠపర్చాలి

ఎస్‌సీవీఈటీ చైర్మన్ డా.నిర్మల్జీత్‌సింగ్ కల్సి

- అంబేడ్కర్ వర్సిటీలో ఓపెన్ ఎడ్యుకేషనల్ రిసోర్సెస్ ఫెస్ట్ ప్రారంభం


ఫెస్ట్‌లో మాట్లాడుతున్న డా.నిర్మల్జీత్ సింగ్ కల్సి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక విశ్వవిద్యాలయాలు దూర విద్యలో ఈ- లెర్నింగ్ ప్రోగ్రామ్‌లు అమలు చేయడంలో మరింత ప్రయత్నం జరగాలని, సాంకేతికతను, నైపుణ్యాభివృద్ధి కోర్సులను ప్రవేశపెట్టడానికి ఓపెన్ వర్సిటీలు ముందుకు రావాలని నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ చైర్మన్ డా.నిర్మల్జీత్ సింగ్ కల్సి పిలుపునిచ్చారు. డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, కామన్‌వెల్త్ ఎడ్యుకేషనల్ మీడియా సెంటర్ ఫర్ ఆసియా ఆధ్వర్యంలో వర్సిటీలో రెండరోజుల పాటు నిర్వహిస్తున్న ఓపెన్ యూనివర్సిటీ- ఓపెన్ ఎడ్యుకేషనల్ రిసోర్సెస్ ఫెస్ట్‌ను గురువారం వర్సిటీలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మార్కెట్లో డిమాండ్ ఉన్న కోర్సులను తమ సంస్థ రూపొందించిందని, వాటిని దేశంలోని యూనివర్సిటీలు వాడుకొని విద్యార్థులకు ఉపాధి కల్పించే విధంగా కోర్సులను రూపొందించాలని సూచించారు. సెంకా డైరెక్టర్ డా.బి.శాద్రచ్ మాట్లాడుతూ ఓపెన్ ఎడ్యుకేషనల్ రిసోర్సెస్ ఫెస్ట్ నిర్వహణ ఆవశ్యకతను వివరించారు. విశ్వవిద్యాలయాల ఉపాధ్యాయులు పరిశోధనపై దృష్టి పెట్టాలని, పరిశోధనలు జవాబుదారీగా ఉండాలని పేర్కొన్నారు. ఈ నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో నైపుణ్యాభివృద్ధిని సాధించేందుకు విద్యా సంస్థలు మరింత ప్రయత్నం చేయాలని సూచించారు. అంబేడ్కర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ. కె.సీతారామరావు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం-2020లో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను అధిగమించడానికి ఇప్పుడు మన ముందున్న సవాళ్ల మనం ఉనికిలో లేకుండా బహిరంగ విద్యా పర్యావరణ వ్యవస్థగా ఉండాలన్నారు. ప్రత్యేకంగా అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 17 శాతం కంటే ఎక్కువ జీఈఆర్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి, న్యాక్ మాజీ డైరెక్టర్ ప్రొ.వీ.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ఓపెన్ ఎడ్యుకేషనల్ రిసోర్సెస్ పాలసీ ఓఈఆర్ విధానం, కొత్త విద్యా విధానం 2020, సమర్థవంతమైన అభ్యాసానికి తగిన పాఠ్యాంశాలు, ఆకర్షణీయమైన బోధన, నిరంతర నిర్మాణాత్మక మూల్యాంకనంతోపాటు తగిన విధంగా విద్యార్థుల మద్దతుతో కూడిన సమగ్ర విధానం అవసరమన్నారు. సార్వత్రిక విశ్వవిద్యాలయాలు నాణ్యమైన పాఠ్యాంశాల డిమాండ్లకు కట్టుబడి ఉంటూనే, ఒ.డి.యల్ ద్వారా నాణ్యమైన విద్యను మెరుగుపర్చడం మరింత విస్తరించడం అవసరమన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్ప చక్రపాణి, కోల్ డైరెక్టర్ ప్రొ.జి.లక్ష్మి కార్యక్రమాల ఏర్పాటు లక్ష్యాలు వివరించారు.

గుంతలమయంగా రోడ్డు


ఇబ్బందులు పడుతున్న ప్రజలు


రాజీవ్‌గాంధీ నగర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు


ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న వాహనదారులు రోడ్డుపై మురుగు నీరు

నిజాంపేట్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లిలోని రాజీవ్‌గాంధీనగర్‌లో సత్యం హైట్స్ ఎదురుగా రోడ్డుపై మురుగునీరు పొంగిపొర్లుతోంది. ఇళ్ల మధ్య చేరిన మురుగునీటి కారణంగా దుర్వాసన వెదజల్లుతోంది. రాజీవ్‌గాంధీనగర్ ప్రధాన రోడ్డులోని అపార్టుమెంట్‌ల నుంచి వస్తున్న డ్రైనేజీ నీరు బయటకు వెళ్లే మార్గం లేక, ప్రధాన రహదారిపైకి చేరుతోంది. మురుగునీటి కారణంగా రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. ఫలితంగా వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


రాజీవ్‌గాంధీ నగర్ రోడ్డు



రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు